పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

సర్వీసు రోడ్డుపై తొలగిస్తున్న చెత్తా చెదారాన్ని పరిశీలిస్తున్న డీసీ రవికుమార్

బండ్లగూడ, జనవరి 21: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పత్తికొండ వద్ద దొరికిపోయిన చెత్త చెదారాన్ని తొలగించారు. ఈ మేరకు ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించి పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడు అంటు వ్యాధులు దరి చేరవని తెలిపారు.

నోటికి వచ్చినట్లు మాట్లాడితే తాట తీస్తం

సమావేశంలో మాట్లాడుతున్న శంషాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్

శంషాబాద్ రూరల్, జనవరి 21: కాంగ్రెస్ నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేదిలేదని, తాట తీస్తామని శంషాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ హెచ్చరించారు. శంషాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, తనపై కాంగ్రెస్ నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, తన ఎదుగుదలను చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తాను కొనుగోలు చేసిన భూమికి కాంగ్రెస్ నాయకులు తనపై ఆరోపిస్తున్న భూమికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంట నే పోలీసులకు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. కాంగ్రెస్ నాయకులు తనపై చేస్తున్న ఆరోపణలలో నిజం లేదన్నారు. గతంలో శంషాబాద్ గ్రామ పంచాయతీకి రెండుసార్లు సర్పంచ్‌గా ఉన్న కుటుంబంలోని వ్యక్తి తనపై తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

అపరిష్కృతంగా.. ఆ రోడ్డెందుకు..!

రెండు శాఖల మధ్య సమన్వయలోపం

- బండ్లబాట కాబట్టే రోడ్డు వేస్తున్నామంటున్న మున్సిపల్ శాఖ
- ఆ భూమి దేవాదాయ శాఖకు సంబంధించినదే
- వేసేందుకు వీలులేదంటున్న దేవాదాయ శాఖ

మంచిరేవులలో అర్థాంతరంగా నిలిచిన రహదారి నిర్మాణ పనులు

మణికొండ, జనవరి 21: గత కొన్నాళ్లుగా రెండు సర్కారు శాఖల మధ్య నెలకొన్న సమన్వయలోపం కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య అపరిష్కృతంగా మారింది. ఓ శాఖ అధికారులు ప్రజాభిప్రాయం మేరకే రహదారి నిర్మాణం చేపడుతున్నామంటే.. మరో శాఖ అధికారులేమో ఆ భూమి తమ శాఖ ఆధీనంలోనిదంటూ పట్టుబట్టారు. దీంతో రహదారి నిర్మాణం అపరిష్కృతంగా తయారైంది.

పూర్తి వివరాల్లోకి వెళితే.., నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామానికి చెందిన చారిత్రాత్మక వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూమిలో నుంచి రహదారిని వేస్తే పక్కనే ఉన్న ఓ ప్రైవేటు విల్లా ప్రాజెక్టుకు అనుకూలంగా మున్సిపాలిటీ అధికారులు నిధులను వెచ్చించి వేస్తున్నారంటూ ఆరోపణల నేపథ్యంలో సమస్య తారాస్థాయి చేరింది. ఈ రహదారి దేవాదాయ శాఖ పరిధిలోకి వస్తుందని ఇక్కడ రోడ్డు వేయొద్దంటూ ఆ శాఖ అధికారులు పట్టుబట్టారు. మా శాఖ నుంచి అనుమతులు పొందిన తర్వాతే రోడ్డు వేయాలని కోరుతుండగా, రోడ్డు వేసేందుకు అనుకూలంగా ఉన్న స్థానికులు కొందరు అప్పట్లో దేవాదాయ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇదిలా వుండగా స్థానికులు కొందరు వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 143 ఎకరాల భూమిలో చాలా భాగం అన్యాక్రాంతమైందంటూ జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆలయ భూముల్లో రహదారి వేయొద్దంటూ హైకోర్టు నుంచి స్టేటస్ కో తెచ్చాడు. ఇంత జరుగుతున్నా మున్సిపాలిటీ అధికారులకు అత్యుత్సాహం ఏమిటనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. కానీ, స్థానిక ప్రజల ఆమోదం మేరకే తాము రహదారి నిర్మాణానికి అనుమతించామే తప్ప, అందులో తమకు ఎలాంటి అవసరం లేదంటూ అధికారులు తేల్చిచెబుతున్నారు. అర్థాంతరంగా నిలిపివేయడంపై స్థానికుల నుంచి వస్తున్న ఒత్తిడితో తమ శాఖ రెవెన్యూ అధికారుల నుంచి రికార్డులను తీసుకున్నామని కమిషనర్ సురేందర్‌రెడ్డి తెలిపారు. అయితే, ఆ రహదారి గ్రామ నక్షలో బండ్లబాటగా నమోదై ఉందని తేల్చారు. బండ్లబాటలో మున్సిపాలిటీ నిధులతో రోడ్డు వేస్తే తప్పేంటని ప్రశ్నిస్తే.. దేవాదాయ శాఖ అధికారులు అడ్డుకోవడమేమిటో అర్థం కావడం లేదని అధికారులు అంటున్నారు.

ఈ రోడ్డు వేస్తే.. ఆ విల్లాలకు లాభమేమిటీ?

ఆరు మాసాలుగా వివాదాల నడుమ సాగుతున్న రహదారి సమస్యపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు శాఖలకు సంబంధించి అధికారుల్లో కొంతమంది పక్కనే ఉన్న విల్లా ప్రాజెక్టు యాజమాన్యంతో అంతర్గత ఒప్పందాలను కుదుర్చుకున్నందుకే వివాదం తారాస్థాయికి చేరుకుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారి వేస్తే ఎంతో కొంత ముట్టజెబుతామని ఆ విల్లా ప్రాజెక్టు మాట ఇచ్చిందని, ఇప్పుడు రెవెన్యూ రికార్డులన్నీ బండ్లబాటగా చూపుతుండటంతో ఇచ్చేదేమీ లేదని సదరు యాజమాన్యం తేల్చిచెప్పడంతో వివాదాలు తెర మీదకు వస్తున్నాయని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు వేస్తే ఆలయానికి వెళ్లే భక్తుల కన్నా పక్కనే ఉన్న విల్లా ప్రాజెక్టుకే ప్రాధాన్యం కల్గుతుందని మరి కొంత మంది మండిపడుతున్నారు.

విల్లా ప్రాజెక్టు అనుమతుల్లో ఏ రోడ్డు ఉంది?

దేవాదాయ శాఖకు చెందిన భూముల్లో నుంచి వేస్తున్న రోడ్డు విల్లా ప్రాజెక్టుకు అనుకూలంగా ఉండటం పక్కన బెడితే.., నిజానికి విల్లా ప్రాజెక్టుకు అనుమతుల్లో చూపిన రోడ్డు ఎక్కడుంది? అంటూ విమర్శకులు ప్రశ్నిస్తున్నారు. ఆలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం రోడ్డు నిర్మిస్తున్నా, విల్లా ప్రాజెక్టు కారణంగానే సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ముందుకు రోడ్డు ఎక్కడ చూపించారనే ప్రశ్నలు అనేకం ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పుడు ప్రజాధనంతో నిర్మిస్తున్న రోడ్డును విల్లా ప్రాజెక్టు ఏవిధంగా వాడుకుంటుందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అనుమతులు ఇచ్చిన హెచ్ఎండీఏ శాఖ అధికారులు సైతం ఈ వివాదానికి సమాధానం చెప్పాలంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రెండు శాఖల మధ్య సాగుతున్న సమన్వయ లోపాల కారణంగా ఆరు మాసాలుగా రహదారి నిర్మాణం ఆగిపోయింది. ఉన్నతాధికారులు సకాలంలో స్పందించి సమస్యకు మోక్షం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత శిబిరాలను వినియోగించుకోవాలి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

బండ్లగూడ, జనవరి 21: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాధవినగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, కామినేని ఆస్పత్రి బృందం కలిసి ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పలు రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలకు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

చేతి వృత్తిదారులను ఆదుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

హిమాయత్‌నగర్‌లోని అమృత ఎస్టేట్స్‌లో క్యాలెండర్ ఆవిష్కరణ చేస్తున్న సాంబశివరావు

హిమాయత్‌నగర్, జనవరి 21: ప్రపంచీకరణ ఫలితంగా ఉపాధి కోల్పోతున్న చేతి వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్‌లోని అమృత ఎస్టేట్స్‌లో తెలంగాణ రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం ముద్రించిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తి కులాలు, ఫెడరేషన్లు పేద బీసీ కులాలకు అందజేయాల్సిన రుణాలు, సబ్సిడీలు, పథకాలు అందజేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. రజకులు అభివృద్ధికి ఆమడ దూరంలో జీవనం సాగిస్తున్నారని, వృత్తి పరంగా వారికి కావాల్సిన కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, నాయకులు గోరుగంటి కృష్ణ, జి.నరేందర్, విజయ్ కుమార్, మారుపాక అనిల్ కుమార్, ఆర్.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ: తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముత్త సంపత్ కురుమ, కడారి నరేంద్ర కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రమాకాంత్ కురుమలతో కలిసి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. – ఖైరతాబాద్

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం

జూబ్లీహిల్స్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేత, టీటీడీ ఎల్ఏసీ సభ్యుడు బోజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రవంతినగర్‌లో నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీ త్రిదండి అహోబిల జీయర్ స్వామి పర్యవేక్షణలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో సహా పలువురు నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

–బంజారాహిల్స్, జనవరి 21:

'జై శ్రీరామ్' సీడీ ఆవిష్కరణ: అయోధ్యలో శ్రీరామ మందిర విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా జూబ్లీహిల్స్‌కు చెందిన ప్రముఖ నటుడు అభినవ్ సర్దార్ కేతావత్ రూపొందించిన 'జై శ్రీరామ్' ప్రత్యేక గీతాల సీడీనీ కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. సమస్త హైందవ జాతి కల సాకారం అవుతున్న శుభ సందర్భంగా శ్రీరాముడిపై భక్తితో రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అల్బమ్‌లోని పాటలను బలిజేపల్లి శరత్ రచించగా, మల్లికార్జున్ స్వరపర్చారని, లోహిత్ కుమార్ దర్శకత్వం వహించినట్టు అభినవ్ సర్దార్ తెలిపారు. – బంజారాహిల్స్, జనవరి 21:

నైపుణ్య శిక్షణ కేంద్రం షురూ

అంబర్‌పేట / చార్మినార్, జనవరి 21: నల్లకుంట శివం రోడ్డులో ఉన్న అడ్వాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆవరణలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(ఎన్ఎస్టీఐ)(మహిళల నైపుణ్య శిక్షణ కేంద్రం)ను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. నాలుగు ఎకరాల్లో రూ.19.90 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్. గౌతంరావు, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, సైనా నెహ్వాల్, సునీతా కృష్ణన్ పాల్గొన్నారు.

మ్యూజియాలు విజ్ఞాన గనులు: కిషన్‌రెడ్డి

మ్యూజియాలు విజ్ఞాన గనులని మన దేశంలో అత్యుత్తమ మ్యూజియాలున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన రెండు అధునాతన బ్లాక్‌లను కేంద్ర మంత్రి ప్రారంభించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

– టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

సేవ్ రంగారెడ్డి జిల్లా కోర్ కమిటీ సభ్యులతో విజ్ఞాన్ కళాశాల చైర్మన్ గౌరీ సతీశ్

బండ్లగూడ, జనవరి 21: గత ప్రభుత్వం జిల్లాలను శాస్త్రీయ విధానమంటూ పాటించకుండా తమకు నచ్చిన విధంగా తమ వారి అవసరాల కోసం జిల్లాలను ఇష్టానుసారంగా విభజించి స్థానిక ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ పేర్కొన్నారు. బండ్లగూడ విజ్ఞాన్ కళాశాలలో ఆదివారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు న్యాయం చేయాలని సేవ్ రంగారెడ్డి జిల్లా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో 'సేవ్ రంగారెడ్డి జిల్లా' కోర్ కమిటీ సభ్యులు భీమ్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన ప్రసంగించారు. జీవో నం. 317 అమలు వలన జిల్లాలో ఉద్యోగులకు జరిగిన అన్యాయం, దాని పరిష్కార మార్గాల కొరకు సమావేశం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు కె.గోపాల్ రెడ్డి, చంద్రప్రకాశ్ రెడ్డి, సేవ్ రంగారెడ్డి జిల్లా కోర్ కమిటీ సభ్యులు బి.మధుకర్ రెడ్డి, బొడ్డు రవి, దర్శన్ గౌడ్, ఘనపురం సుధీర్, విజయ్ కుమార్, మనోరమ, లలిత, సువర్ణ, రాజశేఖర్‌రెడ్డి, బందయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్, యాదగిరి, రాములు, వినోద్, నర్సింహులు, లక్ష్మణ్, నరేందర్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

సోషలిజంతోనే సమస్యల పరిష్కారం

ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో లెనిన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్, జనవరి 21: ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే సోషలిజమే మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్. బోస్,నగర కార్యదర్శి ఎస్.ఛాయ దేవి అన్నారు. రష్యా విప్లవోద్యమ నేత లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో లెనిన్ చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమకాలీన పరిస్థితులను అధ్యయనం చేసి మార్క్సిజంతో అక్టోబర్ విప్లవాన్ని విజయవంతం చేయడంలో లెనిన్ కీలక పాత్ర వహించారని గుర్తు చేశారు. కేంద్రం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పై ఉద్యమించాలని వారు ప్రజలకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి,బి.స్టాలిన్,పి.ప్రేం పావని, ఎన్.శ్రీకాంత్, పల్లె నరసింహ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, బాబు, సబ్బు రాజ మౌళి, ఆరుట్ల రాజ్ కుమార్, అనిల్, వంశీ, అరుణ్ పాల్గొన్నారు.

'ఉద్యోగం ఇప్పించి ఆదుకోండి'

ఖైరతాబాద్, జనవరి 21: తెలంగాణ ఉద్యమం కోసం ఉద్యోగాన్ని వదులుకున్నానని, తనకు తిరిగి ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన సురేందర్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2009లో తనకు ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చిందని, దీంతో కర్నూల్‌లో ట్రైనింగ్‌కు వెళ్లానన్నారు. అయితే, అదే సంవత్సరం జనవరి 26న భారత గణతంత్ర వేడుకల్లో ట్రైనింగ్ క్యాంపులో జై తెలంగాణ నినాదం చేశానని, దీంతో ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఉన్నతాధికారులు ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. వెంటనే తాను ట్రైనింగ్ నుంచి బయటకు వచ్చి ఉస్మానియా యూనివర్సిటీలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాని, తెలంగాణ కోసం ఉద్యోగాన్ని వదులుకున్న డీఎస్సీ నళినిని ప్రభుత్వం పిలిచి జాబ్ ఆఫర్ ఇచ్చిందని, అదే తరుణంలో తనకు కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఓయూ నాయకులు శంకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రత్యేక ఓటర్ నమోదు

బంజారాహిల్స్/ హిమాయత్‌నగర్, జనవరి 21: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓటర్ల నమోదు కోసం కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పిస్తూ రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఆదివారం ముగిసింది. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండి 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్ల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు ఓటర్ జాబితాలో మార్పు చేర్పులకు దరఖాస్తులు తీసుకున్నారు. ఆన్‌లైన్‌లో ఓటర్ నమోదుపై బీఎల్‌వోలు అవగాహన కల్పించారు. ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి పరిశీలించారు.

ఓటరు నమోదు ప్రక్రియ..:

హిమాయత్ నగర్ డివిజన్‌లోని పోలింగ్ కేంద్రాలలో ఆదివారం నూతన ఓటరు నమోదు ప్రక్రియ కార్యక్రమం జరిగింది. ఓటర్లు తమ వ్యక్తిగత వివరాలు, పేరు, ఫొటో, పుట్టిన తేదీ, వయస్సు, చిరునామా తప్పులుంటే సరి చేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించడంతో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధారు కార్డు, రేషన్ కార్డు వంటి పత్రాలను ఓటర్లు బీఎల్‌వోలకు అందజేశారు. కొత్తగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునే వారు ఫారం 6తో పాటు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటోను జతచేయగా, మార్పులు, చేర్పుల కోసం ఫారం–7, 8,8ఏ లను తీసుకుని తప్పులను సవరించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఎల్‌వో సూపర్‌వైజర్స్ లోకేష్, బీఎల్‌వో ప్రేమలత, ఎస్.తిరుపతి నాయక్, ఎస్ఎఫ్ఏలు అర్జున్, ఎం.శ్రీనివాస్, సీ.హెచ్. సోమయ్య, సతీష్ చంద్ర, కె.కామేష్, కె.మధు, కె.శ్రీనివాస్, శ్రీకాంత్, వి.విజయ్, అనిల్, ఫణీంద్ర, యాదగిరి పాల్గొన్నారు.

బంజారాహిల్స్ రోడ్డు నంబర్.14లోని శ్రీ వెంకటేశ్వరనగర్ పోలింగ్ కేంద్రంలో ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న ఓటర్లు

హిమాయత్‌నగర్‌లో దరఖాస్తు ఫారాన్ని అందజేస్తున్న బీఎల్‌వో

విమానాల విన్యాసం

-బేగంపేట్ ఏయిర్‌పోర్ట్‌కు పోటెత్తిన సందర్శకులు

బేగంపేట్ విమానశ్రయంలో వింగ్స్ ఇండియా 2024 ఏవియేషన్ షో ఆదివారం ముగిసింది. ఈ నెల 18న ప్రారంభమైన ఏవియేషన్ షోలో మొదటి రెండు రోజుల పాటు వ్యాపారులకు అనుమతించగా చివరి రెండు రోజులు సాధారణ సందర్శకులకు అనుమతించారు. ఆదివారం చివరి రోజు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఐదు హెలికాప్టర్లు ఆకాశంలో గిరగిరా తిరుగుతూ విన్యాసాలు చేయడం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సందర్శకులు కుటుంబ సమేతంగా తరలివచ్చి ఏవియేషన్ షోను తిలకించారు. – బేగంపేట్, జనవరి 21

శ్రీరాముని ప్రతిష్ఠాపన పండుగలా జరుపుకోవాలి

– సినీ రచయిత చిన్ని కృష్ణ

ఖైరతాబాద్, జనవరి 21: ఆయోధ్యలో నేడు జరిగే శ్రీరాముని ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు పండుగలా జరుపుకోవాలని ప్రముఖ సినీ రచయిత చిన్ని కృష్ణ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడచిన ఐదు శతాబ్దాలలో లక్షలాది మంది ఆయోధ్య రామ మందిరం కోసం బలయ్యారన్నారు. నేడు ఒక్క రక్తపు చుక్క చిందకుండా రాజ్యాంగ, న్యాయ బద్ధంగా కోర్టు తీర్పు ద్వారా ఆలయాన్ని దక్కించుకున్నామని, 500 ఏండ్ల భారతీయుల కల నెరవేరిందన్నారు. ఆలయ పునర్నిర్మాణం జరిగిందన్నారు. సమావేశంలో డాక్టర్ మరింగంటి లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.